

కౌంటింగ్‌కు పూర్తిస్థాయి ఏర్పాట్లు


కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్ బాబు తెలియజేశారు. గురువారం నాడు రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లాల ఎన్నికల అధికారులతో సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఒ కొండయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు 2024లో భాగంగా కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. పార్లమెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌ను హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో మడకశిర, పెనుకొండ, హిందూపురం, కదిరి నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ చేపడతామని తెలిపారు. లేపాక్షి మండలంలోని చోళసముద్రం సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పుట్టపర్తి, ధర్మవరం, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గం కౌంటింగ్‌కు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ అనంతపురంలోని జెఎన్‌టియు కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లలో 21 రౌండ్లు, మడకశిర 14 రౌండ్లు, పుట్టపర్తి 18 రౌండ్లు, ధర్మవరం, కదిరి నియోజకవర్గాలకు 21 రౌండ్లు, హిందూపురం అసెంబ్లీకి 19 రౌండ్లు, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి 19 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి సంబంధిత అధికారులకు ఈనెల 26న జూన్ 1న మొదటి రౌండ్ ర్యాండమైజేషన్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్‌కు సూపర్‌వైజర్‌తో పాటు ఒక అసిస్టెంట్, సూక్ష్మ పరిశీలకులు ఉంటారన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 1852 పోలింగ్ కేంద్రాల్లో 14,03,259 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ వివరించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు



పోలింగ్ మరుసటి రోజు తాడిపత్రిలో రాళ్లు రువ్వుకుంటున్న టిడిపి. వైసిపి మద్దతుదారులు (ఫైల్‌ఫొటో)

◆ ముఖ్య నేతలంతా దూర ప్రాంతాలకు
◆ ఫలితాల అనంతరం ఘర్షణ లేకుండా నిఘా
◆ ఎప్పటికప్పుడు పరిస్థితులపై ఆరా..!

సిట్ ఏమి తేలుస్తుందో..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల రోజు, ఆ తరువాత వరుసగా తాడిపత్రి పట్టణంలో జరిగిన ఘర్షణపై ప్రత్యేక విచారణ బృందం(సిట్) ఏమి తేలుస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికల రోజు జరిగిన ఘర్షణపై రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తాడిపత్రిలోనే అత్యధిక మందిపై కేసులు నమోదయ్యాయి. ఇందులో ఇప్పటికి వంద మంది వరకు అరెస్టు అయినప్పటికీ ఇంకా చాలా మంది అరెస్టు అవ్వలేదు. అరెస్టు చేసే అవకాశముందని భావించి ముఖ్య నేతలంతా అటు వైసిపి, ఇటు టిడిపి లకు సంబంధించిన వారందరూ ఇతర ప్రాంతాలకెళ్లి తలదాచుకుంటున్నారు. ఇంకోవైపు సిట్ బృందం రెండో దఫా విచారణను చేపట్టింది. మొదట విచారణ చేపట్టి ప్రాథమిక నివేదికను డిజిపికి అందించింది. పూర్తి స్థాయి విచారణకు సమయం కావాలని కోరడంతో ఆ సమయమివ్వడంతో మరోమారు ఇక్కడికొచ్చి మొత్తం రికార్డుల పరిశీలనతోపాటు, ఎన్నికల రోజు ఏమి జరిగిందన్న పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరిస్తోంది. పోలీసు అధికారులు, నిఘా సిబ్బంది ఏ మేరకు అప్రమత్తంగానున్నారన్న వివరాలు కూడా సేకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఘర్షణను ముందస్తుగా గుర్తించి నియంత్రించడంలో ఎక్కడ వైఫల్యంజరిగిందన్నది నిర్దిష్టంగా గుర్తించి బాధ్యులను తేల్చే పని కూడా సిట్ చేయాల్సి ఉంది. ఆ పనిని ఇప్పుడు సిట్ చేపట్టినట్టు తెలుస్తోంది. పూర్తి స్థాయి విచారణలో ఏమి తేల్చనుందన్నది చూడాల్సి ఉంది.



తాడిపత్రిలో రాళ్లు రవ్వుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిట్ అధికారులు (ఫైల్ ఫొటో)

ఫలితాల అనంతర పరిణామాలపైనా దృష్టి

సిట్ విచారణ ఒకవైపు కొనసాగుతుండగా ఫలితాల అనంతర పరిణామాలపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో జరిగిన వైఫల్యాలను గుర్తుంచుకుని రాబోయే పరిణామాలను ఇప్పటి నుంచి అంచనా వేస్తున్నారు. ఈ మేరకు నిఘా విభాగం ద్వారా సమాచార సేకరణను చేపడుతున్నారు. ఒక్క తాడిపత్రిలోనే కాకుండా ఇతర నియోజకవర్గాలపైనా దృష్టి సారించారు. సమస్యాత్మకంగా ఉన్న నేతలు, వ్యక్తులను గుర్తించి వారిని ఏ రకంగా కట్టడి చేయాలన్నది చూస్తున్నారు. సమస్యాత్మకం అనుకున్న వ్యక్తులను ఇప్పటికే జిల్లా బహిష్కరణలు సైతం కలెక్టర్ చేశారు. మరికొందరిపై ఇప్పటికే నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. షాడో పార్టీలు ఏర్పాటు చేశారు. ఏ మాత్రం అలజడి చెలరేగినా వెంటనే చర్యలుండే విధంగా సమయత్తం అవుతున్నారు. తాడిపత్రిలో జరిగిన ఘటనలో ఇప్పటికే పోలీసు అధికారులు కొంతమంది న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో మరోమారు ఇటువంటి చోటు చేసుకోకుండా ఉండే విధంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కొత్తగా వచ్చిన జిల్లా ఎస్పీ గౌతమిశాలి కింది స్థాయి అధికార యంత్రాంగం అప్రమత్తతపైనా దృష్టి సారించారు. అర్ధరాత్రి సమయాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఓట్ల లెక్కింపు సమయంలోనూ, ఆ తరువాత ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఉండే విధంగా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

'వరదహస్తం' కథలసంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాంతియుతమైన చక్కని సమాజం ఏర్పడాలనే కోరికతో, అనంత రచయిత్రి గండ్లూరి పంకజమ్మ రాసిన "వరద హస్తం" కథల సంపుటిని గురువారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆవిష్కరించారు. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. పంకజమ్మ రాసిన కథలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన కథలని తెలియజేశారు. సీనియర్ రచయిత్రి జి.నిర్మలారాణి వరద హస్తంలోని కథలను వివరించారు. మధ్యతరగతి జీవితంలో మనుషుల తీరుతెన్నులు, సమాజ పోకడలను యథాతథంగా పంకజమ్మ చిత్రీకరించారని విశిష్ట అతిథిగా పాల్గొన్న డా॥కోడూరి విష్ణునందన్ అభిప్రాయపడ్డారు. విశిష్ట అతిథి, ప్రముఖ విమర్శకులు రాజారామ్ మాట్లాడుతూ మంచి ఎత్తుగడ, మంచి కొనసాగింపు, మంచి ముగింపు, సజీవ పాత్రలతో నిండిన ఈ కథలకు శిల్ప చాతుర్యం తోడైతే మరింత గొప్ప కథలుగా రాణించేవి అని సూచనప్రాయంగా తెలియజేశారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన జి.యమునారాణి, జి.పేరిందేవి ఈ కథలన్నిటినిండా మహిళా ఔన్నత్యం చిత్రీకరింపబడిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా॥పి.శ్రీదేవి, టివి.రెడ్డి, అశ్వర్థ రెడ్డి, ఎ.ఎ.నాగేంద్ర, శేషాచార్యులు, అమరనాథరెడ్డి, షేక్ నబీరసూల్, జయసింహ, జెట్టి జయరాం, గోవిందరాజులు, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, షరీఫ్, మురళి, రియాజుద్దీన్, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

రైల్వే రోడ్డు విస్తరణ జరిగేనా..?



రైల్వే రోడ్డులో భవనాలు కూల్చివేసిన దృశ్యం

ఏళ్లు గడుస్తున్నా టెండరు దశ దాటని పనులు
ముందుకు రాని గుత్తేదారులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రధాన రహదారిలో కిలోమీటరు పొడవు ఉన్న రైల్వే రోడ్డును విస్తరిస్తామని నాలుగేళ్ల క్రితం ముందుకొచ్చిన పాలకులు తాము ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయారు. సకాలంలో బిల్లులు రాకపోవటంతో అహుడా నిధులు కేటాయించినా, గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో రోడ్డు విస్తరణ కథ కంచికి చేరింది. రహదారి నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు ఇస్తామని అహుడా అధికారులు దస్త్రాలు పంపినా, నాలుగేళ్లుగా రహదారి విస్తరణ ప్రక్రియ పూర్తి చేయలేకపోయారు. చివరకు సగం రహదారైనా వేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించి, రోడ్డు నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేని బాలాజీ సర్కిల్ నుంచి నంది విగ్రహం వరకు అరకిలో మీటరు నిర్మాణానికి అహుడాకు ప్రతిపాదనలు పంపారు. అన్ని అనుమతులు తీసుకొని, వారు టెండర్లు పిలిచారు. అయితే బిల్లుల మంజూరు అహుడా నేరుగా చేయకుండా సిఎఫ్ఎంఎస్ ద్వారా ప్రభుత్వమే చేస్తుందని టెండర్‌లో పేర్కొనడంతో గుత్తేదారులు టెండరు దాఖలుకు ముందుకు రాలేదు. సిఎఫ్ఎంఎస్‌లో బిల్లుల చెల్లింపు అంటే గుత్తేదారులు వణికి పోతున్నారు. గతంలో చేసిన పనులకే ఏళ్ల తరబడి బిల్లులు రాలేదని, ఇప్పుడు చేసే పనులకు వస్తాయో, రావో అని భయంతో ఒక్కరంటే ఒక్కరూ ముందుకు రాలేదు. తమకు కావాల్సిన గుత్తేదారులు ఉన్నారని, వారి పేరుతో తామే టెండర్లు వేస్తామని, పనులు చేస్తామని చెప్పిన అధికార పార్టీ నాయకులు సైతం వెనుకంజ వేశారు. దీంతో ఇక రైల్వే రోడ్డు నిర్మాణం ఇప్పట్లో జరగదనితెలిసి పోయింది. కొత్తగా రోడ్డు వేస్తామన్న అధికారులు కొన్నేళ్లుగా ఏర్పడిన గుంతలు కూడా పూడ్చలేదు. దీంతో గుంతలమయంగా మారిన ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

నిండా మునిగిన స్థల యజమానులు

రహదారి విస్తరణకు 130 మంది తమ భవనాలను కోల్పోయారు. భవనాలను కూల్చివేసి, నేలను చదును చేశారు. అయితే వీరిలో ఒక్కరికంటే ఒక్కరికీ నష్ట పరిహారం అందలేదు. స్థల విలువకు నాలుగింతలు చేసి మున్సిపల్ బాండ్లను ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఈ బాండ్లను ఇస్తే వారు వాటిని విక్రయించుకొని, తమకు రావాల్సిన నష్టపరిహారాన్ని పొందవచ్చు. అయితే ఇప్పటి వరకు బాండ్లను ఇచ్చే ప్రక్రియను కూడా పాలకులు, అధికారులు ప్రారంభించలేదు. బాండ్లను ఇవ్వాలంటే స్థల యజమానుల వివరాలను, డాక్యుమెంట్లను సేకరించడం, స్థల విస్తీర్ణం లెక్క కట్టడం చేసి, అన్ని వివరాలను ఆన్‌లైన్ చేయాలి. అనంతరం మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఓ కమిటీగా ఏర్పడి బాండ్ల జారీకి అనుమతులు ఇవ్వాలి. వాటిని పురపాలక శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి, ఆన్‌లైన్ విధానంలో బాండ్లను జారీ చేయాలి. అయితే ఈ ప్రక్రియ ఎక్కువ క్లిష్టతతో కూడి ఉండటం, ఎక్కువ సమయం పడుతుందని, తాము కొన్ని నెలలు మాత్రమే ఇక్కడ పని చేస్తామని, ఎప్పుడైనా వెళ్లిపోవాల్సి ఉంటుందని కొన్నేళ్లుగా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రహదారి విస్తరణకు స్థలాలు ఇచ్చిన యజమానులు నిండా మునిగారు. పరిహారపు బాండ్ల కోసం కార్యాలయం చుట్టూ, నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

రెడ్డిపల్లిలో చీనీచెట్లు నరికివేత

◆ గతంలోనూ ఈ గ్రామంలో ఇలాంటి ఘటనలు ◆ పోలీసుల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో పండ్ల తోటలను నరికివేసే సంస్కృతి కొనసాగుతోంది. తాజాగా మహిళా రైతు వెంకటలక్ష్మమ్మకు చెందిన 189 చీనీ మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నరికివేశారు. 18 నెలల వయస్సున్న మొక్కలను నరికివేశారు. గురువారం ఉదయం తోట వద్దకెళ్లిన మహిళా రైతు నరికివేసిన చెట్లను చూసి కన్నీటిపర్యవంతం అయ్యారు. కాగా ఇదే రైతుకు చెందిన మామిడి మొక్కలను గతంలో కూడా నరికివేశారు. అప్పట్లో దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితులు ఎవరనేది బయట పడలేదు. ఇదే గ్రామానికి చెందిన బాలవర్ధిరాజుకు చెందిన 300 చీనీ చెట్లు, భాస్కర్‌కు చెందిన 150 చీనీచెట్లను గతంలో గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. ఇలా చెట్లను నరికేసే విషసంస్కృతి గ్రామంలో తరచూ కొనసాగుతుండడంతో రెడ్డిపల్లి గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చెట్లు నరికివేసిన విషయం తెలుసుకున్న ఎస్ఐ శరత్‌చంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత మహిళా రైతుతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలియజేశారు.



వెంకటలక్ష్మమ్మ తోటలో పడిఉన్న చీనీ చెట్లు

పోలీసుల తీరుపై విమర్శలు

రెడ్డిపల్లి గ్రామంలో తరచూ పండ్ల తోటలను నరికివేస్తున్నా పోలీసులు సరిగా స్పందించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వరుస ఘటనలు చోటు చేసుకున్నా పోలీసులు నిందితులను గుర్తించడంలో విఫలం అయ్యారు. ఈ నేపథ్యంలో ఒకదాని తర్వాత మరొక ఘటన చోటు చేసుకుంటూనే ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులను గుర్తించి చట్టప్రకారం వారిని కఠినంగా శిక్షించాలని రెడ్డిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.



నరికివేసిన చీనీ మొక్క

బాధిత రైతును ఆదుకోవాలి : ఏపీ రైతు సంఘం

తాడిపత్రి రూరల్ : పెద్దపప్పూరు మండలం రెడ్డిపల్లి గ్రామంలో మహిళా రైతు వెంకటలక్ష్మమ్మకు చెందిన 189 చీనీ చెట్లను నరికి వేయడం బాధాకరమని, ప్రభుత్వం మహిళా రైతుకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు రాజారాంరెడ్డి కోరారు. గ్రామాల్లో చెట్లు నరుక్కునే సంస్కృతిని విడనాడాలన్నారు. ఈ ఘటన పోలీసుల నిర్లక్ష్యం వల్లే జరిగిందన్నారు. ఆ గ్రామంలో గతంలో కూడా ఇలా చెట్లు నరికివేసిన ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఆ సమయంలో నిందితులను పట్టుకుని చర్యలు తీసుకుని ఉంటే మళ్లీ ఇలాంటివి పునరావృతం అయ్యేవి కాదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను శిక్షించాలని కోరారు.

రిటైర్డ్ టౌన్‌బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

జీవితంపై విరక్తితో అనంతపురం జిల్లా తాడిపత్రి టౌన్ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి రైలు కింద పడి బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు... తాడిపత్రి పట్టణానికి చెందిన దద్దం శ్రీనివాసరావు(62) టౌన్ బ్యాంకులో మేనేజర్‌గా పని చేశారు. గతంలో ఈయన చెన్నైలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగాయి. గాయపడిన ఈయన కోలుకునేందుకు చాలా కాలం పట్టింది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఆరోగ్యం కుదుటపడకపోవడంతో జీవితంపై విరక్తితో ఉండేవాడు. కర్నూలులోని ఓ సైక్రియాటిస్ట్ వద్ద చికిత్స తీసుకుంటుండేవాడు. బుధవారం రాత్రి జీవితంపై విరక్తితో తాడిపత్రి సమీపంలోని ఆటోనగర్ రైల్వేట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని వద్ద ఉన్న గుర్తింపు కార్డులతో ఆయన్ను శ్రీనివాసరావుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య విజయలక్ష్మి ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు.

శాంతి, ప్రేమకు ప్రతిరూపం బుద్ధుడు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శాంతి, ప్రేమ, కరుణ, దయకు ప్రతిరూపం బుద్ధ భగవానుడని గ్లోబల్ బుద్ధ పౌర్ణిమ కోఆర్డినేటర్ వాసుదేవ్ ఖిలాని పేర్కొన్నారు. గురువారం బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో ఘనంగా వేడుకలు నిర్వహించారు. సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, జపాన్, తైవాన్, లావోస్, శ్రీలంక, నేపాల్ దేశాల నుంచి పలువురు బౌద్ధ సన్యాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ఊరేగింపుగా వారు సాయి కుల్వంత్ హాలుకు చేరుకున్నారు. మొదట వారి సాంప్రదాయ జ్యోతి ప్రజ్వలనలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుద్ధుడు చూపిన మార్గంలో పయనించాలన్నారు. మరో అతిథి భిక్షుఉత్తరో మాట్లాడుతూ కరుణ దయ చూపడం వంటి సద్గుణాన్ని ఆచరించడం వల్ల భాగోద్వేగ సమతుల్యం పాటించవచ్చన్నారు. అనంతరం బుద్ధ భగవాన్ విగ్రహానికి అభిషేకం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవద్ కిషన్ రావు, పలువురు బౌద్ధులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రత్నాకర్, తదితరులు

కోవెలగుట్టపల్లి వాసికి అరుదైన గౌరవం



గోల్డ్‌మెడల్స్ చూపుతన్న శ్రీకాంత్‌కుమార్

సిఎన్‌ఎలో దేశంలోనే మొదటి ర్యాంకు
పశ్చిమ బెంగాల్ గవర్నర్‌తో సత్కారం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లి కి చెందిన మండ్లి శ్రీకాంత్ కుమార్ యాదవ్ అనే విద్యార్థి సిఎన్‌ఎలో దేశంలోనే మొదటి ర్యాంకు సాధించి 9 గోల్డ్ మెడల్స్ పొంది అరుదైన గౌరవం పొందాడు. ఈ మేరకు శ్రీకాంత్‌కుమార్ యాదవ్ గురువారం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ సి వి ఆనంద్ బోస్ చేతుల మీదుగా 9 గోల్డ్ మెడల్స్, ఒక ప్లాటినంతో పాటు నగదు బహుమతి పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. 2023 పరీక్షలలో దేశంలోనే మొదటి ర్యాంక్ సాధించిన వారిలో శ్రీకాంత్ కూడా ఉన్నాడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మండ్లి కేశవ, నాగేంద్రమ్మ దంపతులకు జన్మించిన శ్రీకాంత్ పుట్టపర్తి జిల్లాకే పేరు తీసుకొచ్చాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ఆశలను మమ్ము చేయకుండా కష్టపడి చదివినందుకు గోల్డ్ మెడల్స్‌తో సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కాగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రత్యేక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది. విద్యార్థులను మరింత ప్రోత్సాహం అందించడానికి ఆ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆ విద్యార్థికి దక్కిన అరుదైన గౌరవాన్ని పలువురు స్వాగతిస్తూ అభినందించారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో మంచి ప్రతిభ కనపరచిన వాల్మీకి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందిస్తున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం తెలిపారు. 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 480 మార్కులు ఆపైన, ప్రయివేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 510 మార్కులు ఆపైన, ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులు 800 మార్కులు ఆపైన, ప్రవేటు కళాశాలల చదివిన విద్యార్థులు 850 మార్కులు ఆపై సాధించిన వాల్మీకి విద్యార్థులు వారి మార్క్స్ మెమో, కులధ్రువీకరణ పత్రం లేదా టిసి నకలు కాపీతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హిందూపురం తాలూకా పరిధిలోని విద్యార్థులు జూన్ 5వ తేదీ లోపల జనార్ధన్ 9441665692, రవి శేఖర్ 7780583140 వాట్సప్ నెంబర్లకు వారి వివరాలను పంపాలని కోరారు.

మాజీ ఎంపీపీకి పరామర్శ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలానికి చెందిన మాజీ ఎంపీపీ నడింపల్లి వెంకటేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత గురువారం వెంకటేష్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డివి ఆంజనేయులు, చంద్ర, సర్పం,ఇ నరసింహమూర్తి, సూర్యనారాయణ, శివప్ప, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాజీ శాసనసభ్యులు వైసీ తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం వైసిపి రాష్ట్ర కార్యదర్శి వై సి గోవర్ధన్ రెడ్డి దంపతులు స్వామివారికి గురువారం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, నాగరాజు, రేకులకుంట నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

జిల్లాలోని నాలుగు మండలాల్లో గల కేజీబీవీల్లో 2024 - 25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి అర్హులైన విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి తెలిపారు జిల్లాలోని నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట, కనగానపల్లి మండలాల్లో గల కెజిబివిల్లో ఎంపీసీ, బైపీసీ, గ్రూపులు ఉన్నాయని ఆసక్తి కల విద్యార్థినిలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మే 29వ తేదీ లోపల ఈ దరఖాస్తులను ఆయా పాఠశాలల్లో అందజేయాలన్నారు.

నేటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - లేపాక్షి

పదవ తరగతిలో పెయిల్ అయిన విద్యార్థులకు శుక్రవారం నుండి జూన్ 3వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యా అధికారి 1 నాగరాజు, మండల విద్యా అధికారి 2 కుళ్లాయప్ప తెలిపారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకొని పరీక్షలకు హాజరుకావాలని వారు సూచించారు.

మల్లెపూల మహోత్సవం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి సన్నిధిలో గురువారం మల్లెపూల మహోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతి అయిన మల్లెపూలతో అలంకరణ చేశారు. తిరువీధులలో భక్తులకు దర్శనం కల్పించారు. మల్లెపూల మంటపం వద్ద ఆనవాయితీగా చేస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయ దారులు, ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న ఎపిపిఎస్‌సి ఉద్యోగాల నియామకానికి పరీక్షలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉద్యోగాల భర్తీకి ఈనెల 25న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ కొండయ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 25న పుట్టపర్తి సమీపంలోని సాంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డు ప్రశాంతి గ్రామ్ వద్దగల కళాశాలలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 100 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈ పరీక్ష కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 7:30 గంటల నుంచి 8:30 గంటల లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆ తరువాత వచ్చే అభ్యర్థులకు అనుమతి ఉండదని అన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

కన్నుల పండువగా రథోత్సవం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కొత్త చెరువులోని బుక్కపట్నం రోడ్డు నందు ఉన్న సంగమేశ్వరుని ఆలయం వద్ద రథోత్సవ వేడుకలను కన్నుల పండువగా గురువారం నిర్వహించారు బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత వారం రోజుల నుండి వివిధ రూపాల్లో సంగమేశ్వరునికి పూజలు నిర్వహించారు బుధవారం రాత్రి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా భక్తుల సందడితో కిక్కిరిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రాజా రమేష్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజు, ఫణి, మాజీ సర్పంచి హరినాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం సంతేబిదనూరు గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైసిపి జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, వేణురెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండా రామాంజి, మంజు, బిసమానెంపల్లి వేణు రెడ్డి, సర్పంచి నాగేంద్ర, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తచెరువులో రథోత్సవం

నిరుపయోగంగా వాణిజ్య భవన సముదాయాలు

పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా రూ.30కోట్లతో నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనాలను అటు పాలకులు గాని...ఇటు అధికారులు గాని ఏ మాత్రం పట్టించు కోవడం లేదు. దీంతో ఆ మార్కెట్ నేడు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. దీంతో ఆకతాయిలు అది అడ్డాగా మారింది. మందుబాబుల నిలయంగా తయారైంది. మున్సిపల్ ఆదాయాన్ని పెంచాల్సిన అధికారులు, పాలకులు వారికి ఆదాయం వచ్చే వాటిపైనే ఎక్కువ దృష్టి సారిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. దీంతో నిర్మాణం జరిగి రెండేళ్లు గడిచినప్పటికి నేటికి వాణిజ్య సముదాయ భవనాలు వినియోగంలోకి తీసుకు రాలేదు.

ప్రజాశక్తి-హిందూపురం

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం

బహిరంగ వేలం జరిగి రెండేళ్లు గడిచినా భర్తీ కాని గదులు

పాలకులకు ముందు చూపు లేకపోయినా... అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయకపోతే సమాజానికి, జనానికి కలిగే నష్టాలు, కష్టాలు తప్పవన్న దానికి నిదర్శనం కళ్లెదుట కనబడే హిందూపురం పట్టణ నడిబొడ్డున రెండున్నర ఎకరాల్లో రూ.30 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన పురపాలక సంఘ వాణిజ్య సముదాయ భవనాలు. హిందూపురం పట్టణంలో వందేళ్ల క్రితం నిర్మించిన కూరగాయాల మార్కెట్ శిథిలావస్థకు చేరడం, కాలు తీసి కాలు పెట్టడానికి అవకాశం లేక అటు కొనుగోలు దారులు, ఇటు వ్యాపారులకు ఇబ్బందికరంగా ఉండటంతో అన్ని హంగులతో వాణిజ్య సముదాయంతో పాటు నూతన మార్కెట్‌ను నిర్మించాలనేది గత 30 ఏళ్లుగా హిందూపురం ప్రాంత వాసుల డిమాండ్. ప్రతి ఎన్నికల్లో రాజకీయ పార్టీల వాగ్దానం అదే. అనేక అడ్డంకులను అధిగమించి, గత ప్రభుత్వ హయాంలో 2016 సంవత్సరంలో పాత మార్కెట్‌ను కూల్చి, దాని స్థానంలో రూ. వంద కోట్లతో సకల సౌకర్యాలతో మార్కెట్ నిర్మాణం చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. అది కాక పోవడంతో రూ. 23 కోట్లతో నూతన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. నిర్మాణ పనులకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేయగా, మరో రూ.3కోట్లు పురపాలక సంఘం, మిగిలిన సొమ్మును గదులు వ్యాపారులకు కేటాయించి, దాని నుంచి వచ్చే గుడ్ విల్‌ను వినియోగించాలని నిర్ణయించారు. అయితే మార్కెట్ ప్రాంతంలో ప్రార్థనా మందిరాలకు స్థలాలను ఇవ్వాల్సి రావడం తదితర సమస్యలతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. దీంతో పూర్తి స్థాయిలో పనులు పూర్తికాక పోయినప్పటికి 2019లో ఎన్నికలు సమీపంచడంతో అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే బాలకృష్ణ మార్కెట్‌ను హడావుడిగా ప్రారంభించారు. అప్పటి నుంచి దాదాపు రెండు సంవత్సరాలు మార్కెట్ గురించి ఎవరు పట్టించు కోలేదు. మున్సిపల్ కమిషనర్ గా భాగ్యలక్ష్మి బాధ్యతలను స్వీకరించిన సమయంలో కాస్తా పనులు జరిగాయి. అనంతరం కమిషనర్‌గా



నిరూపయోగంగా ఉన్నా వాణిజ్య భవనం

వెంకటేశ్వర రావు బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆ సమయంలో ఎమ్మెల్సీగా ఉన్నా ఇక్బాల్ సూచనల మేరకు మార్కెట్ పై ప్రత్యేక దృష్టి సారించారు. అసంపూర్తి ఉన్నా పనులను చక చక పూర్తి చేసి, బహిరంగ వేలం నిర్వహించారు. అయితే మార్కెట్, వాణిజ్య భవనాల్లో బహిరంగ వేలం ద్వారా తీసుకున్న గదుల్లో ఇంకా వ్యాపారాలు ప్రారంభం కాలేదు. కొంత మంది రోడ్డు పక్కన తీసుకున్న వారు గదిలో కాకుండా వరండాలో వ్యాపారాలు చేయడం వల్ల లోపల గదుల్లో వ్యాపారాలు జరగక పోవడంతో వారందరు అద్దె సైతం గిట్టు బాటు కావడం లేదని మూసి వేశారు.

మార్కెట్ స్వరూపం ఇదే

మార్కెట్‌ను ఎ, బి అనే రెండు బ్లాకులుగా రెండు లక్షల చదరపు మీటర్ల పార్కింగ్ స్థలంతో రెండు అంతస్తుల్లో 321 గదులతో నిర్మించారు. ఎన్నికలు రావడం, టిడిపి ప్రభుత్వం ఓడి పోవడంతో పనులు ఆగిపోయాయి. చిన్నచిన్న పనులు పూర్తి చేసి గదులకు వేలం పాటలు నిర్వహించడానికి వైసిపి ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సైతం మార్కెట్లో సౌకర్యాల కల్పనకు వ్యాపారుల నుంచి వచ్చిన నిధుల్లో రూ.7 కోట్లు వరకు వెచ్చించింది. వ్యాపారం బాగా జరుగుతుందని, రెండు బ్లాకుల్లోని కింది అంతస్తులో ఉన్న 183 గదులను వ్యాపారులు ఏకంగా రూ.12 కోట్లు గుడ్‌విల్ చెల్లించి తీసుకొన్నారు. అయితే వ్యాపారాల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారం జరగక వారు లబోదిబోమంటున్నారు. తమ సొమ్ము వాపసు ఇవ్వాలని అధికారులను, నాయకులను కోరుతున్నారు. కింది అంతస్తులోనే వ్యాపారాలు జరగ కపోవడంతో పై అంతస్తులోని 138 గదులను తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. వ్యాపారాలు లేకపోవడంతో, నెల రోజుల్లోనే తాము తీసుకొన్న గదులను వ్యాపారులు మూసివేశారు. వీరు గత 18 నెలలుగా మున్సిపాల్టీకి అద్దె చెల్లించడం లేదు. దీంతో మార్కెట్ అంతా ఖాళీగా మారింది. చివరకు అది మందు బాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మార్కెట్ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని వివరణ కోరగా కొత్తగా బాధ్యతలు తీసుకొన్నానని, వచ్చిన వెంటనే ఎన్నికలు రావాడంతో ఆ పనుల్లో ఉన్నామని తెలిపారు. మార్కెట్‌ను పరిశీలించామని ఉపయోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకొంటామని చెప్పారు.



సముదాయంలో ఆకతాయిలు తాగి పడేసిన మద్యం పాకెట్లు, బాటిళ్లు

వ్యాక్సినేషన్‌తో టిబి దూరం : డిఎంహెచ్ఒ



వ్యాక్సినేషన్‌పై సూచనలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

60 సంవత్సరాల పైబడిన వారికి అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్‌తో వందశాతం క్షయ వ్యాధిని అరికట్టవచ్చుననిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని మంజు వాణి పేర్కొన్నారు. ఆమె గురువారం పుట్టపర్తి మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు, కంబాలపర్తి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో రికార్డులను, వ్యాక్సిన్ గది, కాన్పుల గది, వార్డులను పరిశీలించారు. ముఖ్యంగా ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న ఆడాల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. 18 సంవత్సరాల లోపు ఉన్న వారికి ఈ వ్యాక్సిన్ వేయకూడదన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలలో టీబీ వచ్చి తగ్గిపోయిన వారికి, 60 సంవత్సరాలు నిండినవాళ్లు, పొగ తాగే వారు, షుగర్ వ్యాధి ఉన్నవాళ్లు, బిఎంఐ శరీర ద్రవ్యరాశి సూచిక లేక ఎత్తుకు తగిన బరువు కన్నా తక్కువ ఉన్నవారు, టీబీ రోగులతో సన్నిహిత సంబంధం కలిగిన వారు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఒ నాగరాజు నాయక్, డిఎఎల్‌టి తిప్పయ్య, వెంగళమ్మ చెరువు, కంబాలపర్తి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

ప్రజాశక్తి - నంబుల పూలకుంట



ఆక్రమణను చూపుతున్న వామపక్ష నాయకుడు

మండలకేంద్రానికి సోలార్ పవర్ ప్రాజెక్టు రావడంతో భూములు విలువ బాగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో కొందరు స్వార్థపరులు ప్రభుత్వ భూములపై కన్నేశారురు. ప్రభుత్వ భూమిని కాపాడవలసిన రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కబ్జారాయుళ్ల ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. మండల కేంద్రంలోని మిట్ట కింద కొత్తగా సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. ఆ రోడ్డు ప్రక్కన వేసిన లేఅవుట్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. రెవెన్యూ అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోలేదు. భూ ఆక్రమణపై స్థానిక వామపక్ష నాయకుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భూ ఆక్రమ దారులకు కొందరు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న భూమిని పరిరక్షించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గాయపడిన కార్మికులను ఆదుకోవాలి : వ్యకాసం

ప్రజాశక్తి - చిలమత్తూరు



కార్మికురాలిని పరామర్శిస్తున్న వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్

మండల పరిధిలోని వడ్డిపల్లి కట్ట వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో 10 మంది మహిళా కార్మికులు గాయాల పాలయ్యారు. విషయం తెలుసుకున్న వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ వారిని గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార్మెంట్స్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. ఆరోగ్యకరమైన రవాణ సౌకర్యం కల్పించడంలో టెక్స్ పోర్ట్ సిండికేట్ గార్మెంట్స్ విఫలం అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు పోరాట ఫలితంగా అప్పట్లో వేతనాలతో పాటు సరిపడా రవాణ ఖర్చు ఇస్తామన్న యాజమాన్యం తర్వాతి కాలంలో దానిని కుదించిందని అన్నారు. రవాణ ఖర్చు తక్కువ ఇస్తుండటంతో కార్మికులు ఎక్కువగా ఆటోలలో ప్రయాణిస్తూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. రవాణకు బస్సులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే గాయపడిన కార్మికులకు ఆరోగ్యం కుదుట పడే వరకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పరిగి : మండల కేంద్రంలోని చెరువులో సిరికోలం గ్రామానికి చెందిన వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అందుకు సంబందించిన వివరాల్లోకి వెళితే శీరేకోళంకు చెందిన వడ్డెర రాజగోపాల్ (48) తరచూ పరిగి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లేవాడు. బుధవారం చెరువులో చేపల కోసం వలలు వేశారు. వాటిని తీసేందుకు సాయంత్రం 6 సమయంలో చెరువు వద్దకు వెళ్లే వాటిని తీస్తుండగా చెరువులో ఇరుక్కుపోయాడు. చెరువులో ఇరుక్కుపోయిన రాజగోపాల్ ఊపిరి ఆడక మృతి చెందినట్లు స్థానికులు తెలియజేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడు రాజగోపాల్ భార్య ముద్దమ్మ ద్వారా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



మృతుడు రాజగోపాల్ (ఫైల్‌ఫొటో)

కల్తీ కల్లు తయారు చేస్తే చర్యలు

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గంలో కల్లు తయారీదారులు కల్తీ తయారు చేస్తే చర్యలు తీసుకుంటామని పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సైరా హెచ్చరించారు. గురువారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని కల్లు గీత యజమానులు, కార్మికులు ని బంధనలు పాటించాలన్నారు. ఎస్ఐలు, సిఐలు వారి పరిధిలోని అన్ని అంగళ్లను తనిఖీలు చేసి నివేదికలు పంపాలని ఆదేశించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ముదిరెడ్డిపల్లి సెక్షన్ అసిస్టెంట్ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్ కుమార్ గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు హిందూపురం సబ్ డివిజన్ ముదిరెడ్డిపల్లి సెక్షన్ పరిధిలోని రాచపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న చెలివెందుల, మీన కుంటపల్లి, రాచపల్లి, బాలంపల్లి, జంగాలపల్లి, చర్లపల్లి, పత్తికొండపల్లి, వెలదడకల, తుంగోడు, కొలతట్టుపల్లి, కొలంపల్లి, కావేటి నాగేపల్లి తదితర గ్రామాలలో విద్యుత్ లైన్ల మరమ్మతులు ఉంటాయన్నారు. దీని కారణంగా ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది అన్నారు. ఈ విషయంలో ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్పీ



అనుమానితుల ఇళ్లలో సోదాలు చేస్తున్న పోలీసులు



గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా ప్రజలు, యువత ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతమైన వాతావరణంలో జీవనం గడపాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల జరిగినా నాటినుండి అక్కడక్కడ చెదురు ముదురు సంఘటనలు మినహా ప్రశాంత వాతావరణమే ఉందని, ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో కూడా ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. అన్ని సబ్ డివిజన్ల పరిధిలోని పలు సమస్యాత్మక గ్రామాలు, కాలనీలలో తనిఖీలు నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియను దష్టిలో ఉంచుకొని గ్రామాల్లో కట్టు దిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్లో రౌడీషీటర్లు, పాత కేసుల్లో నిందితులు, అనుమానితుల ఇళ్లల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. పోలీసులు జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు, తనిఖీలు నిర్వహించారు. సిఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులుకర్నాటక మద్యం, నాటు సారా, గుట్కా నియంత్రణ కోసం పాత కేసుల్లోని నిందితుల ఇళ్ల,పశువుల పాకలు, గడ్డి వాము ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఆర్‌సి లేని మోటర్ బైక్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు, పరిగి మండలంలోని బీజు గాని పల్లి గ్రామంలో ఆరు ద్విచక్ర వాహనాలతో 5, వేట కొడవళ్లను సీజ్ చేశారు.

గాండ్లపెంట : ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాలలో ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణవేణి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని వేపరాళ్ల, సిఎం తండా తదితర గ్రామాలలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో. వ్యవసాయ పొలాల్లో, గడ్డివాముల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమేదారులు రామయ్య, శ్రీనివాసులు, సిబ్బంది భాస్కర్, రాజు, బాలాజీ నాయక్, బాషా తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలోని బత్తలపల్లి, వేల్పుమడుగు గ్రామాల్లో సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని గొడవలు, బెదిరింపులకు దిగడం లాంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు. పేకాట, మట్కా. మద్యానికి దూరంగా ఉండాలని, మద్యం విక్రయించేవారి సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రౌడీ షీటర్లు, గత కేసుల్లో నిందితులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రికార్డులు లేని ఆరు ద్విచక్రవాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : మండలంలోని దిగువపల్లి, కుసుమ వారి పల్లి, కొండకమర్ల తదితర గ్రామాల్లో పోలీసులు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. కార్డెన్ సెర్చ్ చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ ఎక్కడా ఘర్షణలు, అల్లర్లు చోటు చేసుకోకుండా మందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించారు. సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐ వంశీకృష్ణ, అమడగూరు ఎస్ఐ మక్బూల్‌బాషా తదితరులు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

లేపాక్షి : ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండల పరిధిలో ఎవైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ గోపీ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సర్ఫుద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.